

152 వ భాగం

త్రిపురాసుర సంహారం - 2

క్రితం నెల వ్యాసంలో త్రిపురాలు ఎలా ఏర్పడ్డాయి, వాటిని సంహరించడానికి శివుడు బాణం వేస్తే ఏమైందో చూసాం. అందులో ఉన్న తారకాసురుడి కొడుకులూ ముగ్గురూ వాళ్ళ బలాలతో పారిపోయి సిద్ధామృతం ఉన్న బావిలో దాక్కున్నారు. అయితే దీనికో చిన్న కథ చెప్పుకుందాం ముందుకి వెళ్ళేముందు. త్రిపురాసులకి బ్రహ్మ వరం ఇచ్చాడని ఒకచోటా, లేదు శివుడే వరం ఇచ్చాడని మరోచోటా పురాణాల్లో కనిపిస్తుంది. ఎవరు వరం ఇచ్చారనేది వదిలేస్తే వాళ్ళు అడిగినది ఏమిటో చూద్దాం. ఈ కథ చాగంటి గారు ఆయన ప్రవచనాల్లో చెప్పినదే. వరం కోరుకోమంటే ఏమి అడిగారు? రావణుడు అడిగినట్టే 'చావు రాకూడదు.' (నాస్తి మృత్యుస్సమశత్రుఃు అమరత్వ మహం వృణే – మృత్యువుకి సాటిలేని శత్రువు మరొకడు లేడు కనక అమరత్వం నాకు ప్రసాదించు). కోరికలు పూర్తిగా పోకుండా ఎవరికీ చావు రాకుండా ఇవ్వడం కుదరదు. అమరత్వం అనేది తపస్సు చేసి సంపాదించుకోవాలి కోరికలు విడిచాక. అది కుదరదు వేరే ఏదైనా కోరుకోండి అంటే ఇప్పుడు అడుతుగుతున్నారు ఏం కావాలో.

"అందరినీ ఓడించగల శక్తి మాకు ఉండాలి. మేము నిర్మించుకునే పురాలు మూడూ ఆకాశంలో ఎక్కడా నిలవకుండా తిరుగుతూ ఉండాలి. అయితే ఈ మూడు పురాలు ఎప్పుడూ ఒక సరళరేఖలోకి రాకూడదు. వస్తే గిస్తే వెయ్యి దివ్య సంవత్సరాలకి సరళరేఖలోకి వచ్చి ఒక్క క్షణం మాత్రమే నిలబడాలి. ఇలా నిలబడినప్పుడు మిట్టమధ్యాహ్నం వేళ అభిజిత్ ముహూర్తంలో చంద్రుడు పుష్యమీ నక్షత్రంలో ఉండగా పుష్కలా వర్తక మేఘాలలోంచి వర్షం కురుస్తుంటే ఇంతకు ముందు పూర్వం ప్రపంచంలో ఎక్కడా కనిపించని, నిర్మించని ఒక కొత్త రథం ఎక్కి, ఎవరూ పట్టుకోని అపూర్వమైన ధనుస్సు పట్టుకుని ఒకే బాణంతో దేవతాసార్వభౌముడు అయినవాడు కొడితే మాత్రమే మాకు చావు రావాలి. అదీ మాకు కావాల్సిన వరం." బ్రహ్మగారు తథాస్తు అన్నారు. హిరణ్యకశిపుడు ఏమనుకున్నాడు? నేలమీద, ఆకాశంలో, ఇంట్లో, బయట ఎక్కడా చావకూడదు. చావు ఎలా రాకుండా ఉండాలో తాను కోరుకున్నాడు. కనీసం అలా అనుకున్నాడు. కానీ విష్ణువు నవ్వుకున్నాడు. ఎందుకంటే తనకి చావు ఎలా కావాలో అలా హిరణ్యకశిపుడు ముహూర్తం పెట్టుకున్నాడు ఈ కోరికతో. ఇక్కడ జరిగేది కూడా అదే. వెయ్యి దివ్య సంవత్సరాలకి సరళరేఖలోకి ఈ మూడు పురాలూ వచ్చినప్పుడు శివుడు

పాశుపతం వేసి తమని చంపేలా ముహూర్తం పెట్టుకున్నారు, వాళ్ళకి వాళ్ళే. దీని గురించి ముందు మళ్ళీ చూద్దాం. మరోసారి కథలోకి వస్తే,

క. సిద్ధామృతరస మహిమను
శుద్ధమహావజ్రతుల్య శోభిత తను లై
వృద్ధిం బొందిరి దానవు
లుద్ధత నిర్ఘాత పావకోపము లగుచున్. [7-398]

ఇలా సిద్ధామృతం తాగగానే వజ్రతుల్యమైన దేహాలు కలిగి బలం పొందారు. ఎటువంటి బలం అంటే పిడుగులలో ఉండే అగ్నివంటి బలం. ఈ పిడుగులో ఉండే విద్యుత్తు చాలా ఎక్కువ అని శాస్త్రీయంగా నిరూపించారు కదా? ఈ పద్యంలో పిడుగు అనేది ఎక్కడుంది? నిర్ఘాతము – పిడుగు. పావకుడు అంటే అన్నింటినీ శుభ్రం చేయగలిగినవాడు; ఇంకెవరు, అగ్ని.

క. కూపామృత రససిద్ధిని
దీపితులై నిలిచి యున్న దేవాహితులన్
రూపించి చింత నొందెడు
గోపధ్వజుఁ జూచి చక్రి కుహనాన్వితుఁడై [7-399]

ఇలా అమృతం తాగిన రాక్షసులని (దేవాహితులు) చూసి శివుడికి ఆశ్చర్యం వేసింది. అయితే విష్ణువుకి ఈ మాయల సంగతి తెలుసు కనక తర్వాత ఏమి చేసాడో చూద్దాం. ఈ పద్యంలో గోపధ్వజుడు అంటే గోప–వృషభం, ధ్వజుడు – జండా మీద ఉన్నవాడు, శివుడు.

శా. ఉత్సాహంబున నొక్క పాఁడిమొదవై యూథంబు ప్రాణించుచున్
వత్సంబై తనవెంట బ్రహ్మ నడవన్ వైకుంఠుఁ డేతెంచి యు
ద్యత్సత్త్వంబునఁ గూపమధ్య రసముం ద్రావెన్ విలోకించుచుం
దత్సౌభాగ్యనిమగ్ను లై మఱచి రా దైత్యుల్ నివారింపఁగన్. [7-400]

విష్ణువు ఒక పాడి ఆవుగా మారాడు. బ్రహ్మ ఆయన వెంట దూడగా నడిచాడు. ఈ రెండూ సిద్ధామృత కూపం దగ్గిరకి నడిచి అందులో రసం అంతా తాగాయి. అయితే అమృతం తాగాక వచ్చిన మత్తులో ఈ రెండూ రావడం, సిద్ధామృతం పూర్తిగా తాగేయడం ఇవన్నీ రాక్షసులు గమనించుకోలేదుట, మర్చిపోయారు. ఇంతకు ముందొకసారి చెప్పుకున్నాం. మాయ అనేది ఆవరిస్తే అలాగే జరుగుతుంది. అదీగాక మృత్యువు దగ్గిరైనప్పుడు ఆపగలిగినదేమీ లేదు కదా?

వ. ఇట్లు విష్ణుండు మోహనాకారంబున ధేను వయి వచ్చి త్రిపుర మధ్య కూపామృతరసంబు ద్రావిన నెఱింగి శోకాకులచిత్తు లయిన రసకూపపాలకులం జూచి మహాయోగి యైన మయుండు వెఱఁగుపడి దైవగతిం జింతించి శోకింపక యిట్లనియె.

[7-401]

ఇదంతా రాక్షసులు చూడకపోయినా త్రిపురాలని నిర్మించిన మయుడు మహాయోగి కనక ఆయన చూసాడు. దైవం అనుకూలంగా లేనపుడు జరిగేది ఇదే కనక రాక్షసులని ఓదారుస్తూ చెప్తున్నాడు.

ఆ. అమరు లైన దనుజు లైనను నరు లైన
నెంత నిపుణు లైన నెవ్వరైన
దైవికార్థచయముఁ దప్పింపఁగా
లేరు<sep>వలదు దనుజులార! వగవ మనకు. [7-402]

ఇంతవరకూ వచ్చాక విచారించడం (వలదు దనుజులార, వగవ మనకు) అనవసరం. దేవతలైనా (అమరులైన), రాక్షసులైనా (దనుజులైన), మానవులైనా (నరులైన) ఎంత గొప్పవారైనా సరే దైవ వశం తప్పించుకోలేరు.

వ. అని పలికె; నంత విష్ణుండు నైజంబు లైన ధర్మవిజ్ఞానవిద్యాతపో విరక్తి సమృద్ధి క్రియాశక్తివిశేషంబుల శంభునికిఁ బ్రాధాన్యంబు సమర్పించి రథసూత కేతు వర్మ బాణాసన ప్రముఖ సంగ్రామ సాధనంబులు చేసినం గైకొని.

[7-403]

విష్ణువు ఈ సమయంలో ఒక రథాన్నీ బాణాలనీ తయారుచేసి పెట్టాడు. ఈ రథం దేనితో చేసాడు? ధర్మం, విజ్ఞానం, విద్య, తపస్సు, విరక్తి, సమృద్ధి, క్రియా శక్తి (ఇవే కదా ఆత్మజ్ఞానం సంపాదించుకోవడానికి కావాల్సినవి). విష్ణువు ఇచ్చిన ఇవన్నీ పట్టుకుని శివుడు (శంభుడు) బయల్దేరాడు మరోసారి ఈ త్రిపురాసులమీద యుద్ధానికి.

మ. శరి యై కార్ముకి యై మహాకవచి యై సన్నాహి యై వాహి యై
సరథుండై సనియంత యై సబలుఁడై సత్కేతనచ్ఛత్రుఁ డై
పరమేశుం డొక బాణమున్ విడిచెఁ దద్బాణానలజ్వాలలం
బురముల్ కాలె ఛటచ్ఛటధ్వని నభోభూమధ్యముల్ నిండగన్. [7-404]

శివుడికి బాణం (శరియై) అమరింది. ధనస్సు (కార్ముకం), కవచం ధరించి రథం (సరథుండై) వాహనం ఎక్కాడు (వాహియై). రథానికి సారథి కూడా అమరాడు (సనియంతయై), సైన్యం (సబలుడై), రథంమీద జండా (సత్కేతనం), ఛత్రం లేదా గొడుగు అమరింది. వీటన్నింటితో పరమేశ్వరుడు బయల్దేరి పాశుపతం (బాణాన్ని) ప్రయోగించాడు. అందులోంచి వచ్చిన అగ్నితో (జ్వాలలం), మూడు పురాలూ భస్మమైపోయాయి – భూమ్యాకాశాలు (నభోభూమధ్యముల్) నిండేలాగా ఛట ఛటమనే ధ్వనితో.

వ. ఇట్లు హరుండు దురవగాహంబు లైన త్రిపురంబుల నభిజిన్ముహూర్తంబున భస్మంబు చేసి కూల్చిన, నమర గరుడ గంధర్వ సాధ్య యక్ష వల్లభులు వీక్షించి జయజయశబ్దంబులు జేయుచుఁ గుసుమ వర్షంబులు వర్షించిరి; ప్రజలు హర్షించిరి; బ్రహ్మాదులు గీర్తించి; రప్సరసలు నర్తించిరి; దివ్య కాహళ దుందుభి రవంబులును మునిజనోత్సవంబులును బ్రచురంబు లయ్యె; నిట్లు విశ్వజనీనం బగు త్రిపురాసురసంహారంబున నఖిలలోకులును సంతసిల్లి యుండ; నయ్యవసరంబున. [7-405]

అలా శివుడు ఎవరికీ చొరలేని త్రిపురాలని అభిజిత్ ముహూర్తంలోకూల్చాడు. ఈ అభిజిత్ ముహూర్తం గురించి ముందు వ్యాసాల్లో చూసాం. రాముడు రావణుడి మీద యుద్ధానికి బయల్దేరింది ఈ అభిజిత్ ముహూర్తంలోనే. ఇలా లోక కంటకులు చావగానే లోకాలన్నీ సంతోషించి ఉన్న సమయంలో

ఆ. తృణకణముల భంగి ద్రిపురంబుల దహించి
పరముఁ డవ్యయుండు భద్రయశుఁడు

శివుఁడు పద్మజాది జేగీయమానుఁ డై
నిజనివాసమునకు నెమ్మిఁ జనియె. [7-406]

గడ్డిపరకలని దహించినట్టూ (తృణకణముల భంగి), త్రిపురాలని దహించిన శ్రేష్టుడు (పరముడు), నాశనం లేనివాడు (అవ్యయుండు), శుభకీర్తి కలవాడు (భద్రయశుడు) అయిన శివుడు బ్రహ్మాది (పద్మజాది) దేవతలతో కీర్తించబడుతూ (జేగీయమానుడై) కైలాసానికి (నిజనివాసమునకు) జేరుకున్నాడు సంతోషంగా. ఈ పద్యం లో నెమ్మి అంటే ప్రీతితో, సంతోషంగా. ఇటువంటి పదాలతో ఉన్న పోతన భాగవతం ఎన్ని సార్లు చదివినా 'మన తరానికి తెలుగు మాత్రం రాదు' అని వప్పుకోవాల్సిందే.

ఈ త్రిపురాసుర సంహారం అనేదానికి మరో రెండు అర్థాలు ఉన్నాయి. బంగారు కాంతులను వెదజల్లే బంగారు పురం సూర్యుడు. చల్లటి కిరణాలను ప్రసరించే వెండి పురం చంద్రుడు. ఇనుముతో చేసిన పురం ఖనిజాలకి నెలవైన భూమి. సూర్యుడు, చంద్రుడు, భూమి అంతరిక్షంలో తిరుగుతూ ఒక్కొక్కసారి సరళరేఖ మీదకు వస్తాయని, అలా రావడం వల్లే గ్రహణాలు ఏర్పడతాయని తెల్సినదే. చంద్ర గ్రహణం కేవలం పౌర్ణమినాడే సంభవించే అవకాశం ఉంది కాబట్టి త్రిపురాసుర సంహారం శివకేశవులకి ఇష్టమైన కార్తీక పౌర్ణమినాడే జరిగిందని చెప్పడం కనిపిస్తుంది.

ఇంకో అర్థం చూద్దాం. త్రిపురాలు మనలో ఉండే స్థూల, సూక్ష్మ, కారణ అనే మూడు శరీరాలతో జాగ్రత్, స్వప్న, సుషుప్తి, అనే మూడూ జరగడం. మనిషి ఎంత కాలం బ్రతికినా ఈ మూడు అనుభవిస్తూనే ఉండాలి. అయితే వీటిని దాటాక కలిగేది తురీయం. దీన్ని చేరడానికి భగవంతుడి మీద భక్తి ఏర్పడాలి. అది లేనంత కాలం ఇంద్రియ సుఖంతో జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలోనే తిరుగుతూ ఉంటాం. తురీయం తెలుసుకోవాలంటే ముందుగా భక్తితో భగవంతుడి పాదాలు పట్టుకోవాలి. అప్పుడు ఆయన బాణం వేస్తాడు. ఆ బాణం తగిలితే ఈ అవస్థలన్నీ పోతాయి, ఈ స్థితి రావడానికి, ఈశ్వరుడు మనలను పైకెత్తడానికి ఆయనకు దయ ఉండాలి. అది భక్తి వల్ల మాత్రమే కలుగుతుంది.

ఇంకో విధంగా కూడా చెప్పుకోవాలంటే మనలో మూడు గుణాలు (సత్వ, తమో రజస్) త్రిపురాలు. ఈ మూడూ పూర్తిగా ధ్వంసం అయితే తప్ప ఆత్మజ్ఞానం కలగదు. ఆ గుణాలు పూర్తిగా పోవాలంటే భగవంతుడి దయ కలగడమే త్రిపురాసుల సంహారం. పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)